సాక్షి చిత్తూరు

శుక్రవారం । 7 । జూలై । 2023



పారదర్శకంగా జగనన్న సురక్ష

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. - 8లో



ఉన్నత చదువుకు సర్కారు బాసట

డిగ్రీ కళాశాలల అభివృద్ధికి, నాణ్యమైన బోధనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కార్పొరేట్ చదువులకు దీటుగా విద్యనందిస్తోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	25
తిరుపతి	34	26
తిరుమల	29	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

కాణిపాకం దేవస్థానానికి 108 వాహనం



వాహన పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 108 వాహనాన్ని మంజూరు చేసింది. ఈ వాహనాన్ని దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు గురువారం పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతు ఆలయం వద్దనే 108 వాహనం వద్దనే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏఈఓ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై అట్రాసిటీ కేసు

ఇంటిపై దాడి ఘటనలో దిశ ఎస్‌ఓఎస్ ఎఫెక్ట్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్, తదితరులు

పెద్దపంజాణి: ఇంటిపై కొందరు దాడి చేసి అన్యాయంగా తమను కొడుతున్నారని ఓ మహిళ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు సకాలంలో స్పందించి బాధితులను రక్షించారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా పెద్దపంజాణి పోలీసు స్టేషను పరిధి లోని నెర్నిపల్లె గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నెర్నిపల్లెకు చెందిన గంగాధర్, గట్టప్ప కుటుంబాలకు మధ్య స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈస్థల సమస్య కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో గట్టప్ప, శంకరయ్య మరికొందరు గంగాధర్ ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. మాటా మాటా పెరిగి గంగాధర్‌ను, అడ్డువెళ్లిన కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. భయాందోళనకు గురైన గంగాధర్ భార్య దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దాడిలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గట్టప్ప, శంకరయ్య తదితరులపై ఐపీసీ సెక్షన్ 427, 354డి, 323, 506, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేశారు.

కేజీబీవీ పోస్టుల భర్తీ



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) కళాశాలల్లో పోస్టుల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ కాలనీ మున్సిపల్ పాఠశాలలో కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టారు. వివిధ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కేజీబీవీల వారీగా ఖాళీలను ప్రదర్శించి అభ్యర్థులు కోరుకున్న పాఠశాలలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ ప్రక్రియలో డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, జీసీడీవో సుజాత, సెక్టోరల్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటముని, సిబ్బంది చైతన్యలు పాల్గొన్నారు.

సజావుగా ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ కేడర్ల టీచర్ల ఉద్యోగోన్నతులకు డీఈవో కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ జరిగింది. సీనియారిటీ జాబితా ప్రకారం టీచర్లు హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం కేడర్ ఉద్యోగోన్నతుల ప్రక్రియను నిర్వహించారు. ఆ తర్వాత ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, పీడీ ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ చేపట్టారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం కేడర్‌కు 18 మంది, ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు 8 మంది, పీఈటీ కేడర్ నుంచి ఫిజికల్ అసిస్టెంట్ కేడర్‌కు 31 మందికి ఉద్యోగోన్నతులు కల్పించినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. ఏడీ వెంకటేశ్వరరావు, సిబ్బంది స్వర్ణలత, సాయి, వీజీ రమణ, గోపాల్, మురళి పాల్గొన్నారు.

ఆలయ ఆస్తులు పటిష్టం

దేవుడి మాన్యాల పరిరక్షణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం కొత్తగా ఆర్డినెన్స్ జారీ చేసింది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో దేవుడి మాన్యం భూములను పచ్చనేతలు ఆక్రమించారు. దీన్ని టీడీపీ ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంది. దీంతో మరింతగా రెచ్చిపోయారు. ఆక్రమిత భూముల స్వాధీనానికి అధికారులు సాహసం చేయలేకపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేవుడి మాన్యం భూముల ఆక్రమణలపై కొరడా ఝుళిపించింది. భూ ఆక్రమణల తొలగింపునకు ఆర్డినెన్స్ జారీ చేసింది. భూముల పరిరక్షణకు 11మందితో కమిటీని నియమించింది.

- దేవదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు
- కొత్తగా ఆర్డినెన్స్ జారీ
- 11 మందితో జిల్లా కమిటీ నియామకం
- భూ ఆక్రమణలకు చెక్ పెట్టేలా చర్యలు
- అన్యాక్రాంతమైన ఆస్తుల గుర్తింపు
- పక్కాగా రికార్డుల నమోదు







పుంగనూరు మఠం భూముల పరిశీలనలో అధికారులు (ఫైల్) (ఇన్‌సెట్) ఆలయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: జిల్లాలో దేవదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ భూములు కొంత మేరకు ఆక్రమణకు గురయ్యాయి. భూములను లీజుకు తీసుకున్న కొందరు గడువు ముగిసినప్పటికీ వాటిని అప్పగించడం లేదు. జిల్లాలో 1,307 దేవాలయాలు ఉండగా.. వీటి పరిధిలో 8,725.50 ఎకరాల భూములు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఇందులో 1,921.05 ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. మిగిలినవి గుట్టలు, అటవీ ప్రాంతాల్లో ఉండగా, వాటిని సాగులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సాగుకు అనుకూలంగా ఉన్న దేవాదాయ భూములను ఏటా వేలం వేసి తద్వారా వచ్చిన రాబడిని ఆలయాల అభివృద్ధికి వినియోగిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 1,088.59 ఎకరాలకు వేలం నిర్వహిస్తున్నారు. ఈ రకంగా ఏటా రూ. 30,42,423 ఆదాయం వస్తోంది. అలాగే 241షాపులు ఉండగా ఏడాదికి రూ.2,63,56,690 ఆదాయం వస్తోంది.

పరిక్షణ కమిటీలో..

దేవదాయశాఖ పరిధిలోని భూములు, ఆస్తులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కమిటీలు వేస్తూ జీఓ 60ను జారీ చేసింది. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, దేవదాయశాఖ ఏసీ (సహాయ కమిషనర్), డీఆర్ఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, డీపీఓ(జిల్లా పంచాయతీ అధికారి), ఆర్‌అండ్‌బీ ఈఈ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ, జిల్లా రిజిస్ట్రార్‌ను సభ్యులుగా చేర్చింది. వీరి పర్యవేక్షణలో ప్రతినెల దేవదాయశాఖ ఆస్తుల పరిరక్షణకు సమావేశం నిర్వహించాల్సి ఉంది. భూమి వివరాలను తెలుసుకుంటూ ఆక్రమణలపై చర్యలు చేపడుతారు. సర్వే నంబర్లతో పక్కాగా రికార్డులు నమోదు చేస్తారు. లీజులో ఉన్న భూములను, షాపులను నిర్ణీత సమయంలో వేలం పాట నిర్వహించి..సకాలంలో నగదు వసూళ్లయ్యేలా చూస్తారు. కోర్టు కేసుల స్థితిగతులను సమీక్షించి వాటి పరిష్కారానికి కృషి చేసేలా ఈ కమిటీ పని చేస్తుంది. ఈ విధానం ఆక్రమణదారుల్లో గుబులు పుట్టిస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్, పరిరక్షణ కమిటీ నియామకంపై దేవదాయశాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇలాంటి నిర్ణయం ఏ ప్రభుత్వం తీసుకోలేదని చెబుతున్నారు.

జిల్లాలోని ఆలయాల వివరాలు

ఆలయ రకం	సంఖ్య	భూముల విస్తీర్ణం ఎకరాల్లో
6ఏ	5	318.86
6బీ	24	285.07
6సీ	1037	468.47
6డీ	15	112.63
ట్రస్టులు, అధికారుల పర్యవేక్షణలో		7,540.47

నాడు పచ్చనేతల అన్యాక్రాంతం



టీడీపీ ప్రభుత్వంలో దేవదాయశాఖ భూములు అన్యాక్రాంతమయ్యాయి. చేతిలో అధికారం ఉందని విచ్చలవిడిగా దేవుడి సొత్తును దోచుకున్నారు. విలువైన వేల ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ధూపదీప నైవేద్యం కింద అర్చకులకు ఇచ్చిన మాన్యాలను కూడా ఆక్రమించుకుని దర్జాగా పాగా వేశారు. కాలం గడిచిన కొద్దీ.. ఆయా భూముల వివరాలు మరుగున పడిపోయాయి. అధికారులు పట్టువీడకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించి కొంత వరకు ఆక్రమణలను విడిపించారు. పూర్తి స్థాయిలో ఆక్రమణదారులతో పోటీ పడలేకపోయారు. దీంతో చివరకు 1307 ఎకరాల భూములు ఆక్రమణ ఖాతాలో నిలిచింది. ఈ భూముల ఆక్రమణలను తొలగించి రికార్డులను పకడ్బందీగా సిద్ధం చేయనున్నారు. దీంతో పాటు లీజుకు తీసుకుని మూల్యం చెల్లించని భూములను స్వాధీనం చేసుకునే చర్యలు ప్రారంభమయ్యాయి.

నేడు దేవుడి సొత్తుకు అధికారాలు

దేవుడి ఆస్తులను పరిరక్షించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంకణం కట్టింది. ఆక్రమణదారుల నుంచి ఆ భూములను విడిపించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొత్తగా ఆర్డినెన్స్‌ను తీసుకొస్తూ..ఆస్తులను కాపాడేందుకు జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈఓలకు బాధ్యతలను అప్పగించింది. ఈక్రమంలో ఆక్రమణదారులకు తొలుత నోటీసులు జారీ చేయాలని అందులో ఆదేశించింది. ఆక్రమణదారులు నోటీసులతో లొంగని పక్షంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆక్రమణలను విడిపించేందుకు చేపట్టాల్సిన విధి విధానాలను వివరించింది. దీంతో దేవదాయశాఖ అధికారులు అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఏ ప్రభుత్వం దేవదాయశాఖ భూములను కాపాడేందుకు ఇలాంటి చర్యలు చేపట్టలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ తేవడం గొప్ప విషయమని శాఖ అధికారులు చెబుతున్నారు.

శుభపరిణామం



దేవదాయశాఖ ఆస్తులను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకోవడం మంచి విషయం. ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో దేవుడి ఆస్తులకు రక్ష. అలాగే జిల్లా కమిటీని కూడా వేశారు. ప్రతినెల ఆస్తుల పరిరక్షణకు జిల్లా కమిటీతో సమీక్షలు జరుగుతాయి. ఇక సులభతరంగా ఆక్రమణలను తొలగించేందుకు వీలుంటుంది. భూములను ఆక్రమించుకోవాలనే ఇక ప్రయత్నిస్తే కేసులు తప్పవు.

–ఏకాంబరం, జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్

అద్భుత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- 14 ఏళ్లు చంద్రబాబు ఏం చేశారు?
- బాబు స్క్రిప్ట్‌తో పవన్ పూనకం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



పుత్తూరు: జగనన్న సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: సంక్షేమ పథకాలతో పేదరికాన్ని పారదోలుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావడం, ఆంధ్రప్రదేశ్ ఓఅద్భుత రాష్ట్రంగా అవతరించడం తథ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. గురువారం పుత్తూరు, నగరి మండలాల్లో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష అని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మరోసారి అధికారం ఇస్తే ఏదో చేస్తామంటున్నారని, ఆయన అధికారంలో ఉన్న 14 ఏళ్లు గాడిదలు కాచారా అని తీవ్రంగా మండిపడ్డారు. తనకు ఒక విజన్ ఉందంటూ బాబు చెబుతున్నారని, ఆ విజన్ కుక్కలు చింపిన విస్తరాకుల కట్ట అంటూ ఎద్దేవా చేశారు. షూటింగ్ గ్యాంప్‌లో రాజకీయాలు చేసే పవన్ కల్యాణ్ చంద్రబాబు స్క్రిప్ట్‌తో జాతరలో పూనకం వచ్చిన వాడిలా ఊగిపోతున్నారని, ఈ వేషాన్ని ప్రజలు బాగా ఎంజాయ్ చేస్తున్నారని వ్యంగంగా విమర్శించారు. బాబు, పవన్‌కు మహిళలు రానున్న ఎన్నికల్లో సైతం బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం జగనన్నకు మహిళలంటే ప్రత్యేకమైన అభిమానమని, అందుకే తాను తీసుకొస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిటే అమలు చేస్తున్నారని చెప్పారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. జగనన్న సైనికులైన మమ్మల్ని ఆదరించాలని మంత్రి రోజా కోరారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో ఆలయ చైర్మన్, ఈఓ, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు ఊరేగింపుగా ఆస్థాన మండపంలోకి తీసుకువచ్చి, పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు విడతలుగా వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు.



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

జగనన్న కాలనీలపై

బహిరంగ చర్చకు సిద్ధమా?

- 31లక్షల మందికి సొంతింటి కల నెరవేర్చాం
- ఇళ్ల నిర్మాణాల్లో దేశంలోనే నాలుగో స్థానం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): జగనన్న కాలనీ నిర్మాణాలపై ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు బహిరంగ చర్చకు సిద్ధమా..? అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. గురువారం మండలంలోని బాలగంగానపల్లె జగనన్న కాలనీ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా దేశంలోనే 31 లక్షల మంది నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసిన నిజమైన పాలకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో దేశంలోనే రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో 7.93 లక్షల ఇళ్లు పూర్తయినట్లు కేంద్ర గృహనిర్మాణ శాఖ ప్రకటించిందని తెలిపారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంపై కేంద్ర మంత్రులు ప్రశంసల జల్లు కురిపించారని, అమరావతిలో పేదలకు ఇంటి స్థలం ఇస్తే గిట్టని చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. నాడు ఐదేళ్ల పాలనలో చంద్రబాబు లబ్ధిదారులకు ఇచ్చిన మొత్తం టిడ్కో ఇల్లు సున్నా అయితే, నేడు సీఎం జగనన్న 61,948 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇచ్చారని తెలిపారు. దేశానికి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. విద్యాభివృద్ధికి అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా ఖరీదైన వైద్యం, పాడి రైతులు అభివృద్ధికి చిత్తూరులో డైయిరీ ప్రారంభం తదితరాలు చెబితే జగనన్న గుర్తుకు వస్తే, వెన్నుపోటు, భూకబ్జా, అవినీతి, రాజకీయ హత్యలు, మోసపూరిత మేనిఫెస్టో తదితరాలకు చంద్రబాబు నాయుడు గుర్తుకు వస్తారని విమర్శించారు. చంద్రబాబుకి ఓటమి భయం పట్టుకుందని అందుకే ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని నారాయణస్వామి ఆరోపించారు.

ఉపాధితో వలసలు నిల్

కుప్పం నియోజకవర్గంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ముమ్మరంగా పనులు కల్పిస్తున్నారు. నిత్యం ఉపాధి పనుల్లో వందల సంఖ్యలో కూలీలు పాల్గొంటున్నారు. ఓ పత్రికలో ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించకపోవడంతో వలస బాట పడుతున్నారని కథనం ప్రచురితం కావడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గుడుపల్లె మండల కంచిబందార్లపల్లె గ్రామస్తులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారి వివరాల మేరకు వాస్తవ పరిస్థితులు ఇలా ఉన్నాయి.

- కూలీలకు ముమ్మరంగా పనులు
- కూలి గిట్టుబాటు.. గ్రామంలోనే పనులు
- అవాస్తవాలపై గ్రామీణుల మండిపాటు




గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుప్పం: గుడుపల్లె మండలం గుడికొత్తూరు, కంచిబందార్లపల్లె, పీబీవాడ, జేకేపల్లెలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ముమ్మరంగా పనులు కల్పిస్తున్నారు. కంచిబందార్లపల్లె గ్రామ పంచాయతీలో 150 మందికి పనులు కల్పించి 40 పనులు పూర్తి చేశారు. పీబీవాడ, గుడుకొత్తూరు, జీకే పల్లెలో 200 మంది కూలీలు గత నెలగా నిత్యం ఉపాధి పనుల్లో పనులు చేస్తున్నారు. శాంతిపురం మండలం వెదురుగుట్టపల్లె, వెంకటాపురంలో 60 మంది కూలీలు నిత్యం ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. సోమాపురం, వెంకటాపురం గ్రామాల్లో వారం రోజులుగా 150 మంది ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. ఇలా ప్రతి పంచాయతీలో వందల మంది కూలీలు పనిచేస్తుంటే పనులు లేక వలసలుగా వెళుతున్నట్లు తప్పుడు కథనం ప్రచరించడం దారుణమని కూలీలు, ఆయా గ్రామస్తులు తీవ్రంగా మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకుని కథనాలు రాయాలని సూచించారు.

టీడీపీ హయాంలోనే వలసలు

టీడీపీ హయాంలో ఈ గ్రామాల్లో కూలి పనులు కోసం బెంగళూరు పట్టణాలకు తరలి వెళ్లేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకివచ్చిన తరువాత నాలుగేళ్లుగా వలసలు తగ్గాయి. నవరత్నాలు పథకాల కింద ప్రతి ఇంటికీ రూ.లక్షల లబ్ధి అందడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఉపాధి పనుల్లో కూలి గిట్టుబాటు అవుతుండడంతో గ్రామాల్లోనే పనులు చేసుకుంటూ కుటుంబాలతో సంతోషంగా ఉంటున్నామని ఆయా గ్రామస్తులు అంటున్నారు.

ఎక్కడికీ వెళ్లడం లేదు



ఉపాధి పథకం పనులు చేసుకుని స్వగ్రామంలోని ఉంటున్నాం. మా గ్రామం నుంచి పనులు కోసం ఎవరూ వలస పోవడం లేదు. ఇప్పుడు ఉపాధిలో పనులతో కూలి గిట్టుబాటు అవుతోంది. దీంతో పనులు కోసం మా గ్రామం వదలి ఎక్కడికీ వెళ్లడం లేదు.

–సరోజమ్మ, కంచిబందార్లపల్లె

వలసలు తగ్గాయి



ఉపాధి పనులతో మా గ్రామంలో వలసలు తగ్గాయి. కూలి గిట్టుబాటు అవుతోంది. దీనికి తోడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో ఆనందంగా ఉన్నాం. పనుల కోసం వలస వెళ్లడం లేదు. మా గ్రామంలోనే పనులు చేసుకుంటున్నాం.

కృష్ణప్ప, పీబీవాడ, గుడుపల్లె మండలం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో


బోల్తాపడిన ఆటో

కుప్పంరూరల్: కుప్పం మండలం, రాగిమానుమిట్ట క్రాస్ వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రయాణికులను ఎక్కించుని ఆటో కుప్పం నుంచి మల్లానూరు వైపుగా వెళ్తోంది. రాగిమానుమిట్ట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వల్పంగా ఢీకొని ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఆటోలో ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ద్విచక్రవాహన దారుడు మాత్రం గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కుప్పంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

పారదర్శకంగా జగనన్న సురక్ష

బంగారుపాళెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మండలంలోని తుంబకుప్పం, ఈచనేరిపల్లె సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలసి క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద అందిస్తున్న వివిధ ధ్రువపత్రాల గురించి ప్రజలకు వివరించారు.ధ్రువ పత్రాలను సకాలంలో అందించాలని అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 796 గృహాలకు సంబంధించి 522 సమస్యలు వచ్చాయని, వాటిని సకాలంలో పరిష్కరించి ధ్రువపత్రాలను అందజేస్తామని సిబ్బంది తెలిపారు. డీఎల్‌డీఓ రవికుమార్, తహశీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు సర్కారు బాసట

నాడు : పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువుకు కల్పించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను టీడీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. చాలా మంది ఉన్నత చదువులకు దూరమయ్యారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు రావడం లేదని కార్యాలయాల చుట్టూ విద్యార్థులు కాళ్లరిగేలా తిరిగేవారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏ మాత్రం అభివృద్ధి చేయని దుస్థితి. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించుకోలేక చాలా మంది విద్యార్థులు టీడీపీ పాలనలో ఉన్నత చదువులకు స్వస్తి పలికారు.

నేడు : పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు శ్రీకారం చుట్టారు. ఉన్నత విద్య అభ్యసించే వారికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేస్తున్నారు. ఏటా నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదును ప్రభుత్వం జమచేస్తోంది. డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సైతం సర్కారు చర్యలు చేపడుతోంది. మౌలిక వసతులను కల్పిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు.


పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జోరుగా అడ్మిషన్ల ప్రక్రియ
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువులకు భరోసా
- సకల సౌకర్యాలు, హాస్టల్ వసతి
- 12 వరకు దరఖాస్తులకు అవకాశం
- కళాశాలల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కార్పొరేట్ చదువులకు దీటుగా విద్యనందిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర కోర్సులున్నాయి. కళాశాలల్లో అన్ని వసతులూ ఉన్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 ప్రభుత్వ డిగ్రీ, 121 ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలున్నాయి. ఆ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ లో చేరాలనుకునేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 12 వ తేదీ వరకు గడువు ఉంది. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా పీవీకేఎస్ కళాశాల

జిల్లా కేంద్రంలోని పీవీకేఎస్ డిగ్రీ కళాశాలలో ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలున్నాయి. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ అనుమతి పొందింది. ఆ కళాశాలకు ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చదివిన చాలా మంది ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారు. అదే విధంగా ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూరవిద్యను అందిస్తున్నారు. నాక్ ఏ గ్రేడ్ ఉండడంతో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిధులను కేటాయిస్తోంది. కళాశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. విశాలమైన క్రీడామైదానం, సమీపంలోనే బాలికల కోసం ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాలున్నాయి. కళాశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ప్రొజెక్టర్‌లు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, గ్రీన్‌బోర్డులు, కంప్యూటర్ సిస్టమ్ టీచింగ్ లెర్నింగ్ ఎయిడ్‌తో బోధన సాగుతోంది.


సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

మహిళా విద్యకు చిరునామా సావిత్రమ్మ కళాశాల

మహిళలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల చదువులకు కేరాఫ్‌గా భాసిల్లుతోంది. విద్యార్థినులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో విలువలతో కూడిన విద్యా విధానం అందిస్తున్నారు. ప్రైవేటు రంగానికి దీటుగా అనేక సౌకర్యాలు కళాశాలలో ఉన్నాయి. ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, రీడింగ్ రూం, కంప్యూటర్ రూం, జవహర్ విజ్ఞాన కేంద్రం, కళాశాలలోనే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం వసతులున్నాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణమైన కోర్సుల్లో విద్యార్థినులను ఉత్తములుగా తీర్చిదిద్దుతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..

ప్రభుత్వ కళాశాలలు	21
ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు	121
అడ్మిషన్ రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ	జూలై 12
వెబ్‌ఆప్షన్‌ల నమోదు	జూలై 15 నుంచి జూలై 19 వరకు
సీట్ల కేటాయింపులు	జూలై 24
కళాశాలల్లో చేరాల్సిన తేదీ	జూలై 24

పరిశోధనల విద్యకు పీవీకేఎస్ ఆదర్శం



బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అనేక విద్యాసంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థులకు ఉపయోగకరంగా అన్ని సౌకర్యాలు పీవీకేఎస్ కళాశాలలో ఉన్నాయి. ప్రైవేట్‌కు దీటుగా అన్ని హంగులతో కళాశాలను కొనసాగిస్తున్నాం. అడ్మిషన్ ప్రక్రియలో విద్యార్థులు ఈ కళాశాలను ఎంపిక చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు తీర్చిదిద్దుకోవాలి. – డాక్టర్ ఆనందరెడ్డి, ప్రిన్సిపల్,పీవీకేఎస్ డిగ్రీ కళాశాల,చిత్తూరు

విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేలా...



మా కళాశాలలో అందిస్తున్న విద్యా బోధన విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ఉంటోంది. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ బోధన సాగిస్తున్నాం. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వం కళాశాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఇటీవల మా కళాశాలను నాక్ బృందం సందర్శించింది. ఆ బృందం ఏ గ్రేడ్ ప్రకటించింది. – డాక్టర్ కె.మనోహర్, ప్రిన్సిపల్, సావిత్రమ్మ డిగ్రీ కళాశాల చిత్తూరు

లక్ష్మిరెడ్డికి ఘన నివాళి


సదుం: నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి పెద్దిరెడ్డి లక్ష్మిరెడ్డి 11వ వర్ధంతిని ఎర్రాతివారిపల్లెలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన సమాధి వద్ద మంత్రి పెద్దిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, కవితమ్మ, అభినయ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులతో కలిసి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అర్హులైన విభిన్న ప్రతిభావంతులు జాతీయ పురస్కారాలకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ప్రతిపాదనలను www.awards.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31 లోపు నమోదు చేసుకోవాలన్నారు. సర్వేష్ట దివ్యాంగజన్, శ్రేష్ట దివ్యాంగజన్, శ్రేష్ట దివ్యాంగ్ బాల్, బాలిక, దివ్యాంగీత కే క్షేత్ర మే శ్రేష్ట పునర్వాస్ తదితర అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన తర్వాత ఒక సెట్‌ను తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర సందేహాలను వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని వెల్లడించారు.

వీజీతోపులో లేగదూడల ప్రదర్శన


ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ వీజీతోపు గ్రామంలో గురువారం లేగదూడల ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ యువరాజు ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓడీఎల్‌డీఏ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పేయి దూడల కృత్రిమ గర్భధారణ కోసం ఎద సూదులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దూడల నట్టాల నివారణ మందులను పంపిణీ చేసి, మేలు జాతి దూడలు కలిగిన రైతులకు బహుమతులు అందజేశారు. మండల పశు వైద్యాధికారి జయశ్రీ, సర్పంచ్ దామోదరం, వైస్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సంపంగిరెడ్డి, హరీష్‌కుమార్, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఖజానా ఎస్టీవోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : ఖజానా శాఖలో పలువురు ఎస్టీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర శాఖ డైరెక్టర్ మోహన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి జిల్లా నుంచి ఎస్టీవో శివకిరణ్, అన్నమయ్య జిల్లా నుంచి ఎస్టీవో రవికుమార్, సీనియర్ అకౌంటెంట్లు జానకిరామరెడ్డి, అర్పణ, రోహిత్, జూనియర్ అసిస్టెంట్ తేజశ్విని చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరితో పాటు తిరుపతి జిల్లా నుంచి ఒక సీనియర్ అకౌంటెంట్, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్‌లు, అన్నమయ్య జిల్లా నుంచి ఒక జూనియర్ అకౌంటెంట్, ఒక ఓఎస్ (ఆఫీస్ సబార్డినేట్) చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

రేపు మెగా జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ :ఈనెల 8వ తేదీన సీఎంటీ రోడ్డులో ఉన్న తమ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ పేర్కొన్నారు. వివిధ పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2022–23లో డిగ్రీ పూర్తి చేసిన వారు, 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ తుది సంవత్సరం చదువుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ట్యాంకర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి


మృతి చెందిన హరి

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద గురువారం పాల ట్యాంకర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు ఘటన స్థలంలోనే మృతి చెందాడు...ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు మేలుమాయి గ్రామానికి చెందిన హరి(33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పనిమీద ద్విచక్ర వాహనంలో పలమనేరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోనే హరి మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ఎవరి కోసం ఈ అసత్య వార్తలు..!

- రూ.కోటికి ఒప్పందం అంటూ తప్పుడు కథనాలా..?
- పోలీసులపై నమోదైన కేసు నిష్పక్షపాతంగా విచారణ
- ఇలాంటి కథనాలపై చట్టపరంగా ముందుకెళతాం
- 'ఈనాడు' రాతలపై చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఫైర్


మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: 'చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసిన ఘటనలో, వాళ్లే ఫిర్యాదు చేస్తే పారదర్శకంగా ఉండాలని ఎస్ఐ సహా కానిస్టేబుల్‌పైనా అత్యాచార సెక్షన్ల కింద కేసు పెట్టాం. కేసు దర్యాప్తునకు ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించాం. ఇంకా దీనిపై మరికొన్ని నివేదికలు వస్తేనే దర్యాప్తు కొలిక్కి వస్తుంది. ఇలాంటి సమయంలో ఫిర్యాదు చేసినవారికి రూ.కోటి ఇవ్వడానికి పోలీసులు బేరసారాలు చేస్తున్నారంటూ తప్పుడు కథనాలు రాస్తారా..? ఎవరి కోసం ఈ అసత్య వార్తలు రాస్తున్నారు..?' అని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి 'ఈనాడు'పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో జరిగిన క్రిష్ణగిరి వాసుల ఘటనపై పలు వివరాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

- చిత్తూరు, పూతలపట్టు పోలీస్ స్టేషన్లలో జరిగిన చోరీల కేసులో తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన వైరముత్తు, అయ్యప్పతో పాటు ఓ గ్యాంగ్ హస్తం ఉందని స్పష్టమైన సమాచారం రావడంతో గతనెల 15వ తేదీన అయ్యప్పన్‌తో పాటు మరో మహిళను అరెస్టు చేశాం. తొలిసారి నేరానికి పాల్పడడంతో ముగ్గురు మహిళలకు తమిళనాడు నుంచి వచ్చిన నిందితుల తరఫు న్యాయవాది సమక్షంలోనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాం. నిందితులు ఎవరినీ కూడా కొట్టలేదని, ఎలాంటి దాడులకు పాల్పడలేదని వాళ్ల న్యాయవాది సమక్షంలోనే పోలీసులకు వీడియో స్టేట్‌మెంట్ ఇచ్చారు.
- 16వ తేదీ మధ్యాహ్నం క్రిష్ణగిరి వెళ్లిన ముగ్గురు మహిళా నిందితులు, వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన మిస్సింగ్ ఫిర్యాదుపై క్రిష్ణగిరి రెవెన్యూ అధికారుల సమక్షంలో అక్కడి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తమను ఎవరూ కొట్టలేదని, హింసించలేదని వాంగ్మూలంలో పేర్కొన్నారు.
- 17వ తేదీ క్రిష్ణగిరి ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యి.. పూతలపట్టు పోలీసులు తమను హింసించారని, లైంగికదాడి చేశారని వైద్యులకు చెప్పారు. అప్పటికప్పుడు మాకు సమాచారం రావడంతో ఎస్ఐతో పాటు, ఐదుగురు కానిస్టేబుళ్లపై అత్యాచారం,ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, వాళ్లందరినీ ఇతర స్టేషన్లకు బదిలీ చేశాం. ఏఎస్పీ స్థాయి అధికారిని విచారణ అధికారి నియమించాం. క్రిష్ణగిరి ఆస్పత్రి వైద్యుల నుంచి లైంగిక దాడికి సంబంధించిన నివేదికలు రావాల్సి ఉంది. సాక్షులుగా పేర్కొంటున్న వాళ్లను విచారించాల్సి ఉంది.
- ఇలాంటి సమయంలో నిందితులు పెట్టిన కేసు ఉపసంహరించుకోవడానికి చిత్తూరు పోలీసులు రాజీ ప్రయత్నం చేస్తున్నారని, రూ.కోటి ఇవ్వడానికి ఒప్పందం కుదరగా, సగం ఇచ్చారంటూ తప్పుడు వార్తలు వండి వార్చారు (ఈనాడు పత్రికను ఉద్దేశించి). ఎవరి కోసం ఇలాంటి అసత్య వార్తలు రాస్తున్నారు..? నిందితులకు లేని ఆలోచనలు కొందరు మీడియా వ్యక్తులు కల్పిస్తున్నారని అర్థమవుతోంది. దీనిపై చట్టపరంగా ముందుకు వెళతాం.
- మేము పోలీసులకు అనుకూలంగా వార్తలు రాయమని ఏ ఒక్కర్నీ అడుక్కోవడంలేదు. అలాగని వ్యతిరేకంగా వార్తలు రాయకూడదని ఆదేశాలు ఇవ్వడంలేదు. ఏదిపడితే అది రాస్తూ నిందితులు, సాక్షులను విచారించాల్సిన సమయంలో దర్యాప్తునకు మీ వార్తలు ఆటంకం కలిగిస్తున్నాయి.
- పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు వైరముత్తు నుంచి చిత్తూరు పోలీసులు రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉంది. ఇతనిపై లెక్కలేనన్ని కేసులు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటకలో నమోదయ్యాయి. వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం రాసేప్పుడు మా వివరణ తీసుకుంటే బాగుంటుంది. .అని ఎస్పీ అన్నారు.